ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆయా కూడళ్లు, ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. పట్టణంలోని మిట్టగూడెం, బలుసుపాడురోడ్‌లో గుంజ రోశయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అమ్మవారి విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి వేదాద్రిలోని కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు బుల్లిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.రంగు బజారులో రాజస్థానీలు ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహానికి నిమజ్జనం చేశారు. మహిళా భక్తులు కోలాటాల నృత్యప్రదర్శనలతో అమ్మవారి ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. స్థానిక తోట బజారులో తోటబజారు యూత్ ఏర్పాటుచేసిన మండపంలో శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహానికి చేసిన అలంకరణ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. రంగు రంగుల బెలూన్లు, పూలతో ఏర్పాటుచేసిన అలంకరణ ఆకర్షణగా నిలిచింది.


మిట్టగూడెంలో అమ్మవారి మండపం వద్ద భక్తులతో ఎమ్మెల్యే ఉదయభాను


పేటలో అమ్మవారి విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న రాజస్థానీలు

ఘనంగా నిమజ్జనాలు ..

వేదాద్రి(జగ్గయ్యపేట): దసరా నవరాత్రుల సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను బుధవారం నిమజ్జనాలకు తరలించారు. పదిరోజులపాటు పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పెనుగంచిప్రోలులో..

గ్రామంలోని తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని బుధవారం నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో అమ్మవారి విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకవాహనంలో తరలించి మున్నేటిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

నందిగామలో..

నందిగామ: నందిగామ పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గమ్మల విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. దసరా ఉత్సవాల సందర్భంగా పూజలు అందుకున్న అమ్మవారిని మేళతాళాల నడుమ నందిగామ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం నిమజ్జనానికి తరలించారు. బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.


పేటలోని మిట్టగూడెంలో నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను


తోటబజారులో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు విగ్రహం


నందిగామలో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న భక్తులు


నందిగామలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


పెనుగంచిప్రోలులో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

త్రిశక్తి పీఠంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: మండలంలోని పల్లగిరి గట్టుపై త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న త్రిమాతలను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ దసరా మహోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు దేవీ శరన్నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, మన్నెం దాసు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


త్రిశక్తి పీఠంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు

అభివృద్ధి పనులకు భారీగా నిధులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్):గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల సమస్యలు పరిష్కారం, అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడులో గడపగడపకు మనప్రభుత్వం నిధులు రూ.40లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో డ్రైన్‌లు సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి పారుదల సజావుగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడేవారని గుర్తుచేశారు. మురుగునీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే అవసరమైన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు .

స్వాగత ద్వారానికి శంకుస్థాపన..

గ్రామంలోని జగనన్న కాలనీలో రూ. ఐదు లక్షలతో చేపడుతున్న స్వాగత ద్వార నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శంకుస్థాపన చేశారు. జగనన్న కాలనీల లబ్ధిదారులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో 30 శాతం మేర గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసముంటుండగా, 70 శాతం మేర ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. గతప్రభుత్వ హయాంలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వకపోగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 30లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చి పేదల సొంతింటి కలను సాకారం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ కస్తాల పున్నమ్మ, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, కందుల నాగేశ్వరరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

నందిగామ: పట్టణ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని 18వ వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికులకు సరఫరా అవుతున్న త్రాగునీటిని పరిశీలించడంతోపాటు ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సరఫరా చేసే నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ టెస్ట్ లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రజలు కూడా సహకరించాలన్నారు.ప్రజలు తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా భద్రపరచి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. ఆయన వెంటసచివాలయ సిబ్బంది ఉన్నారు.


ప్రజలకు సరఫరా అయ్యే నీటిని పరిశీలిస్తున్న నందిగామ మున్సిపల్ కమిషనర్ జయరాం

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ ఆశయ్య నాయక్ ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచిచారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు. ముఖ్యంగా వీఆర్వోలు ఆయా గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అన్ని గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

వీఆర్వోలతో సమీక్ష

కంచికచర్ల : ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరా ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారని, వాటిని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులను గుర్తించి ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు.

ముసునూరు తాత్కాలిక ఎంపీపీగా రాజానాయన

ముసునూరు: తాత్కాలిక ఎంపీపీగా లోపూడి ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ-1 కోటగిరి రాజానాయనను నియమిస్తూ కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ, ఏలూరు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఎంపీపీగా పనిచేసిన రాపర్ల కృష్ణకుమారి అనారోగ్య కారణంతో రాజీనామా సమర్పించగా ఈ తాత్కాలిక నియామకం చేపట్టినట్లు ఎంపీడీవో వివరించారు.

పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం సచివాలయ, శానిటరీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో సచివాలయం సిబ్బంది, శానిటరీ సిబ్బందితో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ కౌన్సిల్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.24కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కానీ ఇప్పటికీ శానిటేషన్ వ్యవస్థపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ పరిస్థితి మారాలన్నారు. మీకేమైనా ఇబ్బందులు ఉంటే స్వయంగా తనకు గాని, కమిషనర్‌కు గాని తెలియజేయాలని సిబ్బందిని కోరారు. సిబ్బందికి కావాల్సిన అన్ని సదుపాయాలు తమ కౌన్సిల్ ద్వారా అందజేస్తున్నామని, ట్రాక్టర్లు, ఆటోలు వార్డులకు సరిపోయే విధంగా, శానిటరీ సిబ్బంది అంతా అందుబాటులో ఉన్నప్పటికీ కనీస బాధ్యత తీసుకోకపోవడం ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, చిత్రంలో కమిషనర్, అధికారులు

పాఠశాలకు వంట సామగ్రి అందజేత


పాఠశాలకు వంటసామగ్రిని అందజేస్తున్న సర్పంచి జ్యోతిబ్రహ్మం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని సర్పంచ్ జ్యోతిబ్రహ్మం పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం కింద అనిగండ్లపాడు మండల పరిషత్ పాఠశాలకు మంజూరైన వంటసామగ్రిని బుధవారం ఏజెన్సీ నిర్వాహకులకు అందజేశారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సీఆర్పీ బాబు, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు భోజనం ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు ..

పెనుగంచిప్రోలు : గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1992-93 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు హైదరాబాద్ అభయ ఫౌండేషన్ సహకారంతో పాఠశాలకు భోజనం ప్లేట్లు, గ్లాసులను బహూకరించారు. ఈ మేరకు ప్లేట్లు, గ్లాసులను పాఠశాల హెచ్‌ఎం జలజకు బుధవారం అందజేశారు. పూర్వవిద్యార్థులు బండ్లమూడి రాంబాబు, సముద్ర లక్ష్మణరావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, నరసింహారావు, మోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

280 మందికి వైద్యపరీక్షలు


షేర్‌మహ్మద్‌పేటలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కీర్తిరెడ్డి, పక్కన ఎంపీడీవో రమేష్‌బాబు, నాయకులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట):గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట సచివాలయం-1 పరిధిలోని ప్రజలకు స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్నిఆయన ప్రారంభించారు. వైద్యాధికారులు స్రవంతి, కీర్తిరెడ్డి పాల్గొని 280మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ శిబిరాల్లో రూ.1500 విలువ చేసే ఏడు రకాల వైద్యపరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, కార్యదర్శి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు కమలేష్, బాలయ్య, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

చాట్రాయి: సారా తయారుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ విశ్వనాథరావు హెచ్చరించారు. సారా తయారీదారులకు బుధవారం సారా నిర్మూలనపై కౌన్సిలింగ్ ఇచ్చారు. సారా తాగిన అనేక మంది అనారోగ్యానికి గురై చనిపోతున్నారని, ఈ నేపథ్యంలో సారా తయారీని నిర్మూలించాలని ఆయన కోరారు. అనంతరం ఏడుగురు సారా తయారీదారులను నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మురళీధర్, తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు.

ఎఫ్‌ఎల్‌సీ పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్‌ఎల్‌సీ) పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి వారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో భాగంగా గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోడౌన్‌లో ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియపై బుధవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 1,605 బ్యాలెట్ యూనిట్లు, 1605 కంట్రోల్ యూనిట్లు, 1,695 వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తున్నామన్నారు. చెకింగ్ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 285 యూనిట్ల చొప్పున 20 రోజుల పాటు 5,700 పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గొల్లపూడి గోడౌన్ వద్ద కలెక్టర్ ఢిల్లీరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

29న సొసైటీ ఉద్యోగుల మహాసభ

నూజివీడు: పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర రెండవ మహాసభను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో ఉదయం తొమ్మిది గంటలకు మహాసభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాంతీయ సమస్యలతోపాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్టు పేర్కొన్నారు. అన్ని జిల్లాల నుంచి పీఏసీఎస్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

వైభవంగా మానసాదేవి కల్యాణం



నందిగామ : పట్టణ శివారులోని కాదంబరి శ్యామక ఆశ్రమంలో బుధవారం మానసాదేవి కళ్యాణాన్ని నిర్వహించారు. ఏకాదశి పర్వదినం నేపథ్యంలో ఆశ్రమంలోని అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. లోక శాంతిని కాంక్షిస్తూ ఆశ్రమపీఠాధిపతి దేవి పర్యవేక్షణలో వేద పండితులు అమ్మవారి కళ్యాణం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శాంతికల్యాణం..

నందిగామ : పట్టణ శివారు పల్లగిరిగుట్టపైగల త్రిశక్తి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దుర్గా మల్లేశ్వరస్వామివార్ల శాంతి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



షేర్ మహమ్మద్ పేట (జగ్గయ్యపేట): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ఆట వస్తువులతో ఆడించి, చదివించాలని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి లక్ష్మీభార్గవి సూచించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీకేంద్రం-2 బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులను మంచి పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసే ఆటవస్తువులను అలంకారప్రాయంగా ఉంచకుండా పిల్లలను ఆడించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం విశిష్టతను వివరించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గ, అంగన్వాడి కార్యకర్తలు నర్సుబాయి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం



తిరువూరు: స్థానిక విజయవాడరోడ్డులోని శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానంలో దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అయ్యప్పదీక్షాపరులతోపాటు శైవదీక్ష, భవానీ మాలా ధారులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజారావు తెలిపారు. ఆలయ 26వ వార్షికోత్సవ సందర్భంగా పడిపూజా కార్యక్రమానికి పాటను కూడా నిర్వహించినట్లు తెలిపారు.

నీటి యాజమాన్యంపై శిక్షణ



తిరువూరు: వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై ఎన్టీఆర్ జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో తిరువూరు మండలం కోకిలంపాడులో బుధవారం క్షేత్రపరిశీలన అనంతరం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి సమస్య ఉన్న భూముల్లో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, యూరియా లీటరు నీటికి 20 గ్రాములు కలిపి ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని రైతు శిక్షణ కేంద్ర వ్యవసాయాధికారి సత్యవతి తెలిపారు. తిరువూరు ఏవో పద్మ పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారానికి నివేదిక

నూజివీడు: ఈ ఖరీఫ్ సీజన్‌లో నూజివీడు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో వర్షాభావం కారణంగా 550ఎకరాల్లో వరిపంట ఎండిపోయిందని ఏడీఏ జి.విద్యాసాగర్ బుధవారం తెలిపారు. సెప్టెంబరు, అక్టోబర్‌లో సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోదవడంతో వరి పంటకు కావాల్సిన సాగునీరు అందలేదన్నారు. చాట్రాయి మండలం చనుబండ, నరసింహారావుపాలెం పరిధిలో చెరువుల కింద సాగుచేసిన వరి పంటకు సాగు నీటి ఎద్దడి కారణంగా 500 ఎకరాలు, ముసునూరు మండలం గుడిపాడు పరిధిలో 50 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని తెలిపారు. నష్టపరిహారం మంజూరు కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించామని తెలిపారు.